# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 294 బుధవారం 29 మే 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# గులాబీ లెక్క ఆరు

- శాసనసభ ఎన్నికలు జరిగి ఐదు నెలలు కావస్తుంది
- ఈసారి బీఆర్ఎస్‌కు అత్యధిక స్థానాలు వచ్చే అవకాశముందన్న అంచనాలు ఎక్కువగా వినిపిస్తుండటం విశేషం
- గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మూడు, బీజేపీకి నాలుగు స్థానాలు రాగా, ఒకటి ఎంఐఎం దక్కింది
- గతంలో వచ్చిన నాలుగు స్థానాలకు మించి ఈసారి సీట్లు దక్కించుకునే ఛాన్స్ అయితే లేకపోలేదంటున్నారు
- కాంగ్రెస్ హామీలు అమలుపై బిన్నాభిప్రాయాలు, కేసీఆర్‌పై సానుకూలతతో బీఆర్ఎస్‌కు సీట్లు పెరిగే అవకాశం




హైదరాబాద్:

తెలంగాణలో పార్లమెంటు ఎన్నికలు ముగిశాయి. అయితే ఈ ఎన్నికల్లో ఎవరికి అత్యధిక స్థానాలు వస్తాయన్న విషయంలో మాత్రం అనేక రకాలు అంచనాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అత్యధిక స్థానాలను సాధిస్తుందని ఎక్కువ మంది రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ కూడా గతం కంటే ఎక్కువ స్థానాలను సొంతం చేసుకుంటుందని చెబుతున్నారు. కానీ ఈసారి బీఆర్ఎస్ కు అత్యధిక స్థానాలు వచ్చే అవకాశముందన్న అంచనాలు ఎక్కువగా వినిపిస్తుండటం విశేషం. తెలంగాణ శాసనసభ ఎన్నికలు జరిగి ఐదు నెలలు కావస్తుంది. ఆ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ ఐదునెలలు తిరగక ముందే -మిగతా3లో



## ఢిల్లీ మద్యం కేసు... కేసీఆర్‌కు ముందే తెలుసు

- ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మరో సంచలనం..
- కేసీఆర్ పాత్రేంటో చెప్పేసిన ఈడీ
- ఢిల్లీ మద్యం పాలసీ గురించి కేసీఆర్‌కు కవిత చెప్పారన్న ఈడీ
- ఢిల్లీలోని కేసీఆర్ అధికారిక నివాసంలో తన టీమ్ సభ్యులను కవిత పరిచయం చేసినట్లు వెల్లడి
- కవిత పరిచయం చేసిన వారి నుంచి కేసీఆర్ వివరాలు అడిగి తెలుసుకున్నారన్న ఈడీ

హైదరాబాద్/న్యూ ఢిల్లీ

దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో మరో సంచలనం చోటుచేసుకుంది. ఈ స్కామ్‌లో అడ్డంగా బుక్కయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తీహార్ జైల్లో ఊచలు లెక్కెడుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ స్కామ్‌లో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పాత్ర ఏంటనేది ఈడీ తాజాగా కుండ బద్ధలు కొట్టింది. ఢిల్లీ హైకోర్టులో ఇవాళ విచారణ జరగగా.. కేసీఆర్ పాత్రను ఏంటనేది -మిగతా3లో



## 400 సీట్ల మాట మీరు మరిచిపోండి

- 200 కూడా దాటవు
- గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈ ఎన్నికల్లో బీజేపీ సీట్లు తగ్గుతాయి
- కాంగ్రెస్, 'ఇండియా' కూటమి లబ్ధి పొందుతుంది
- మీరు కనీసం ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేయలేరు.
- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

## బిర్యానీ తింటే.. అంతే సంగతులు

- మీరూ హైదరాబాద్ బిర్యానీ తింటున్నారా?
- మీ ప్రాణాలకి గ్యారెంటీ లేనట్లే..!
- నగరంలోని పలు ప్రాంతాల్లో ఇలాంటి బిర్యానీ తిని హాస్పిటల్ పాలవుతున్న చాలా మంది ప్రజలు
- ఏకంగా కొందరికి ప్రాణాల మీదికొచ్చింది
- ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి



హైదరాబాద్

ఆదివారం వచ్చిందంటే చాలు.. అందరికీ నాన్ వెజ్ కావాల్సిందే. ముఖ్యంగా బిర్యానీ అయితే ఖచ్చితంగా ఉండాల్సిందే. రోజూ ఉండే బిజీబిజీ లైఫ్ పక్కన పెట్టి ఫ్యామిలీతో కలిసి మంచి ఫుడ్ తినాలని చాలా మంది అనుకుంటారు. అలా కొంతమంది బయటికి వెళ్లి తింటుంటే, మరికొందరు ఇళ్లలోనే వేడివేడిగా బిర్యానీ చేసుకుని ఆరగిస్తూ ఉంటారు. మార్కెట్లో దొరికే బాస్మతి రైస్ తీసుకొచ్చి నచ్చిన రీతిలో వండుకుని రుచులు ఆస్వాదిస్తూ ఉంటారు. అయితే మార్కెట్లో దొరికే బాస్మతీ రైస్ -మిగతా3లో



## కాకతీయ కళాతోరణంపై ఎందుకంత కోపం!

- చార్మినార్ అంటే మీకెందుకంత చిరాకు..!!
- సీఎంను సూటిగా ప్రశ్నించిన కేటీఆర్
- కాకతీయ కళాతోరణం, చార్మినార్ అనేవి రాచరికపు గుర్తులు కాదు
- వెయ్యేళ్ల సాంస్కృతి వైభవానికి చిహ్నాలు



## నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు కాల్!

- తెలంగాణలో వరుస బాంబు బెదిరింపు ఫోన్ కాల్స్ కలకలం
- ఇవాళ ఒకే రోజు ప్రజాభవన్, నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు ఫోన్ కాల్స్
- అలర్ట్ అయిన పోలీసులు బాంబు స్క్వాడ్ సాయంతో విస్తృతంగా సోదాలు
- ఎలాంటి బాంబు ఆనవాళ్లు లభ్యం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు

# రాష్ట్రంలో హింసకు చోటు లేదు

- ఆంధ్రాలో అంత హింస జరిగిన తెలంగాణలో ఒక్క ఘటన కూడా చోటు చేసుకోలేదు
- తాము అధికారంలోకి వచ్చాక ఎన్నో వేడుకలు జరిగాయి
- ఎక్కడ హింసకు తావు లేకుండా శాంతి భద్రతలు చూసుకున్నాం
- రాష్ట్ర కొత్త చిహ్నాన్ని రూపొందిస్తున్నాం
- కొత్త చిహ్నం పనిని ఫైన్ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌కు, కళాకారులకు అప్పగించాం
- తెలంగాణ రాష్ట్ర గీతానికి స్వరకల్పన చేసే పనిని అందెశ్రీకి అప్పగించాం
- ఫోన్ ట్యాపింగ్‌తో నాకు ఎలాంటి సంబంధం లేదు
- తాను ఫోన్ ట్యాపింగ్ చేయించడం లేదు
- ప్రస్తుతానికి ఈ అంశాన్ని అధికారులే చూసుకుంటున్నారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



న్యూఢిల్లీ

ఎన్నికల సమయంలో పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో అంత హింస జరిగిన తెలంగాణలో ఒక్క ఘటన కూడా చోటు చేసుకోలేదు.. రాజకీయ ప్రత్యర్థులు సైతం విమర్శించడానికి వీలు లేకుండా పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ పూర్తి చేశాం.. అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఎన్నో వేడుకలు జరిగాయని.. ఎక్కడ హింసకు తావు లేకుండా శాంతి భద్రతలు చూసుకున్నాం అంటూ పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు.. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర చిహ్నంలో రాచరికపు పోకడలు ఉండకూడదన్నదే తమ విధానమన్నారు. తెలంగాణ అంటేనే రాచరికానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు గుర్తొస్తాయ్.. అందుకే రాష్ట్ర కొత్త చిహ్నాన్ని రూపొందిస్తున్నామన్నారు. కొత్త చిహ్నం పనిని ఫైన్ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌కు, కళాకారులకు అప్పగించామన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతానికి స్వరకల్పన చేసే పనిని అందెశ్రీకి అప్పగించామని.. ఎవరితో సంగీతం చేయించుకుంటారో తమకు సంబంధం లేదన్నారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సోనియా గాంధీకి ఆహ్వానం అందిస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరంపై సాంకేతిక నిపుణుల సూచనల మేరకు ముందుకెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జ్యుడీషియల్ విచారణ మూడు బ్యారేజీలకే పరిమితమని.. కాళేశ్వరం, -మిగతా3లో

# ప్రజాభవన్‌కు బాంబ్ బెదిరింపు



- పోలీస్ కంట్రోల్ రూమ్‌కి ఆగంతకుడి ఫోన్
- రంగంలోకి దిగిన పోలీసులు
- ప్రజా భవన్‌లో విస్తృత తనిఖీలు
- డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు
- నివాసం లోపల, పరిసర ప్రాంతాలు, వాహనాలను తనిఖీ చేసిన ఐఎస్‌డబ్ల్యూ, సిఎస్ డబ్ల్యూ పోలీసులు
- రెండు గంటలపాటు తనిఖీలు

హైదరాబాద్:

ప్రజా భవన్‌లో బాంబ్ ఉందని ఓ ఆగంతకుడు ఫోన్ చేశాడు. దీంతో పోలీసులు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది హుటాహుటిన పరుగులు తీశారు. అందులో ఉంటున్న డిప్యూటీ సీఎం దంపతులు, సిబ్బందిని బయటకు పంపించి అణువణువు తనిఖీ చేపట్టారు. ఫోన్ చేసిన వ్యక్తిని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నం అయ్యారు. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కుటుంబం ఉంటున్న -మిగతా3లో

# దోస్తీ.. కుస్తీ



**పంజాబ్ :** ఇండియా కూటమిలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు భాగస్వామ్య పక్షాలు. అయితే ఈ రెండు పార్టీలు సార్వత్రిక ఎన్నికల వేళ... పలు లోక్‌సభ స్థానాల్లో కలిసి పోటీ చేస్తున్నాయి. ఇంకా సోదాహరణగా చెప్పాలంటే దేశ రాజధాని న్యూఢిల్లీల్లో మొత్తం 7 లోక్‌సభ స్థానాల్లో నాలుగింటిలో ఆప్ పోటీ చేస్తుంటే.. 3 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను నిలిపింది. అయితే పంజాబ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. పరోక్షంగా ఇరు పార్టీలపై పరోక్షంగా విమర్శలు చేయడం గమనార్హం. పంజాబ్ రాజధాని అమృత్‌సర్‌లో మల్లిఖార్జున ఖర్గే మాట్లాడుతూ.. పంజాబ్ యువత డ్రగ్స్ బారిన పడిందన్నారు. దాంతో ఆ రాష్ట్ర భవిష్యత్తుకు ముప్పుగా పరిణమించిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలోని శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. అయితే పంజాబ్‌లో ఆప్ పార్టీకి చెందిన భగవంత్ మాన్ సర్కార్ అధికారంలో ఉంది. అలాంటి వేళ.. కాంగ్రెస్ పార్టీ అధినేత మల్లిఖార్జున్ ఖర్గే ఇలా భాగస్వామ్య పక్షం ఆప్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఇక ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సైతం లూథియానాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు ఓ పార్టీ పరిపాలించిందంటూ కాంగ్రెస్ పార్టీపై పరోక్షంగా విమర్శలు చేశారు. తమ పార్టీ పంజాబ్‌లో అధికారంలోకి వచ్చి రెండేళ్లే అయిందని ఈ సందర్భంగా కేజ్రీవాల్ గుర్తు చేశారు.

## 400 సీట్ల మాట మీరు మరిచిపోండి..




**అమృత్‌సర్:** భారతీయ జనతా పార్టీ "అబ్ కీ బార్ 400 పార్" నినాదంతో ఈసారి ఎన్నికల్లో దిగడం, ఇంతవరకూ జరిగిన ఆరు విడతల ఎన్నికలో దాదాపు లక్ష్యానికి చేరుకున్నామని క్లెయిమ్ చేసుకోవడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవారంనాడు స్పందించారు. 400 సీట్ల క్లెయిమ్ "బక్వాస్" (నాన్సెన్స్) అని కొట్టిపారేశారు. ఆ పార్టీకి 200 సీట్లు కూడా దాటవని చెప్పారు. అమృత్‌సర్‌లో మంగళవారంనాడు జరిగిన మీడియా సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ, గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈ ఎన్నికల్లో బీజేపీ సీట్లు తగ్గుతాయని, కాంగ్రెస్, 'ఇండియా' కూటమి లబ్ది పొందుతుందని చెప్పారు. అలాంటప్పుడు 400 సీట్లకు పైగా గెలుచుకుంటామని ఏ ఆధారంతో వాళ్లు (బీజేపీ) చెబుతున్నారని ప్రశ్నించారు. "మీరు (సీట్లు) తగ్గుతూ మేము పెరుగుతున్నాం. 400 సీట్లు మాట మరిచిపోండి. అదంతా నాన్సెన్స్. మీరు కనీసం ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేయలేరు. మీకు 200 సీట్లకు మించి రావు" అని ఖర్గే స్పష్టం చేశారు.

## నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు కాల్!




తెలంగాణలో వరుస బాంబు బెదిరింపు ఫోన్ కాల్స్ కలకలం సృష్టిస్తున్నాయి. ఇవాళ ఒకే రోజు ప్రజాభవన్, నాంపల్లి కోర్టుకు ఇలా బాంబు బెదిరింపు ఫోన్ కాల్స్ రావడం గమనార్హం. మొదట ప్రజాభవన్‌లో బాంబు పెట్టామంటూ గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం ఉదయం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు బాంబు స్క్వాడ్ సాయంతో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. కానీ, ఎలాంటి బాంబు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దాంతో ఈ ఫేక్ కాల్ చేసిన వ్యక్తి కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై ఒకవైపు విచారణ జరుగుతుండగానే తాజాగా నాంపల్లిలోని కోర్టుకు బాంబు బెదిరింపు కాల్ రావడం కలకలం రేపింది. నాంపల్లి కోర్టులో బాంబు పెట్టామని, మరి కాసేపట్లో కూల్చేస్తామని ఆగంతుకుడు పోలీసులకు ఫోన్ చేశాడు. దీంతో వెంటనే అలర్ట్ అయిన పోలీసులు బాంబు స్క్వాడ్ బృందాలతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కానీ, ఎలాంటి బాంబు ఆనవాళ్లు లభ్యం కాకపోవడంతో ఫేక్ కాల్‌గా పోలీసులు నిర్ధారించుకున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

## మే 31 లోపు పాన్ కార్డును ఆధార్‌తో లింక్ చేసుకోండి

పాన్ కార్డును ఆధార్ తో అనుసంధానం చేసుకోవాలని కేంద్రం ఎప్పటి నుంచో ప్రకటనల మీద ప్రకటనలు ఇస్తోంది. ఇప్పటికే పలుసార్లు ముగింపు గడువు పొడిగించింది. ఈ నేపథ్యంలో, పాన్ కార్డు-ఆధార్ లింక్ చేయడంపై ఆదాయపన్ను శాఖ మరోసారి స్పందించింది. మే 31వ తేదీ లోపు పాన్ కార్డును ఆధార్ తో లింక్ చేయాలని స్పష్టం చేసింది. లేకపోతే పాన్ కార్డు నిరుపయోగంగా మారిపోతుందని హెచ్చరించింది. నిర్ణీత గడువులోగా పాన్ కార్డు-ఆధార్ అనుసంధానం చేయకపోతే భారీగా అధికరేటుతో టాక్స్ డిడక్షన్ లు ఎదుర్కొనాల్సి ఉంటుందని వివరించింది. టీడీఎస్-టీసీఎస్ చెల్లింపులు ఎగవేసినట్టుగా కొందరు పన్ను చెల్లింపుదారులకు నోటీసులు రావడానికి కారణం... వారు పాన్ కార్డును ఆధార్ తో అనుసంధానం చేసుకోకపోవడమేనని ఆదాయ పన్ను శాఖ వివరించింది. వారి పాన్ కార్డు నిరుపయోగంగా మారడంతో, రిటర్న్ లో పేర్కొన్న పాన్ నెంబరు చెల్లుబాటు కాలేదని వెల్లడించింది. అందుకే మే 31 లోపు పాన్ కార్డును ఆధార్ తో అనుసంధానం చేసుకుని అదనపు భారం తగ్గించుకోవాలని సూచించింది.

## ఎన్టీఆర్‌ను స్మరించుకున్న ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు జయంతి నేడు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ సేవలను ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్మరించుకున్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుణ్ణి స్మరించుకుంటున్నాం. తెలుగు సినీ రంగంలో విశిష్ట నటుడైన ఆయన ఎంతో దార్శనికత గల నాయకుడు. సినీ, రాజకీయ రంగాలకు ఆయన చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. తెరపై ఆయన ధరించిన పాత్రలను, ఆయన నాయకత్వ పటిమ ను ఇప్పటికీ తలచుకుంటారు ఆయన అభిమానులు. ఆయన కలలు కన్న సమాజం కోసం మేము నిరంతరం పని చేస్తామని మోదీ ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. మరోవైపు ఎన్టీఆర్‌పై ప్రధాని మోదీ చేసిన ట్వీట్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు.

## పాకిస్థాన్ అంటే ఆ పార్టీ భయం



**భువనేశ్వర్:** పాక్ ఆక్రమిత కాశ్మీర్ విషయంలో కాంగ్రెస్ పార్టీ మాట్లాడట్లేదని.. పాకిస్థాన్ అంటే ఆ పార్టీ భయపడుతోందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సంచలన విమర్శలు చేశారు. ఒడిశాలోని జాజ్‌పూర్‌లో ఎన్నికల ర్యాలీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్‌లో అణుబాంబు ఉందని చెబుతోంది. పీఓకే గురించి మాట్లాడొద్దని అంటోంది. నవీన్ బాబు (ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్), రాహుల్ బాబా (కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ) పీఓకే విషయంలో భయపడుతున్నారు. పీఓకే భారత్‌కి చెందింది దాన్ని మేం వెనక్కి తీసుకుంటాం" అని షా స్పష్టం చేశారు. లక్షలాది మంది ఒడిశా యువకులు పని వెతుక్కుంటూ ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని పేర్కొన్న హోంమంత్రి, డబల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటయ్యాక యువత వేరే చోట ఉద్యోగాల కోసం వెళ్లాల్సిన అవసరం లేకుండా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

**జూన్ 4 తర్వాత ఒడిశా మాజీ సీఎంగా నవీన్..**

147 మంది సభ్యుల అసెంబ్లీలో 75 సీట్లకు పైగా సాధించడం ద్వారా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని షా ధీమా వ్యక్తం చేశారు. జూన్ 4 తర్వాత ఒడిశా నవీన్ మాజీ సీఎం అవుతారని షా ఎదురు దాడి చేశారు. రాష్ట్రంలోని 21 లోక్‌సభ స్థానాల్లో 17 స్థానాలను కాషాయ పార్టీ గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు."జూన్ 4న నవీన్ బాబు ముఖ్యమంత్రిగా ఉండరు. మాజీ సీఎం అవుతారు. ఒడిశాలో 17 లోక్‌సభ స్థానాలు, 75 అసెంబ్లీ నియోజకవర్గాలను బీజేపీ గెలుచుకోవడం ఖాయం" అని షా అన్నారు. తదుపరి ముఖ్యమంత్రి ఒడియాలో అనర్గళంగా మాట్లాడగలరని, రాష్ట్ర భాష, సంస్కృతీసంప్రదాయాలను అర్థం చేసుకునే వ్యక్తిని బీజేపీ ముఖ్యమంత్రిగా ప్రకటిస్తుందని తెలిపారు.

## అరుణాచల్ ప్రదేశ్‌కు రెడ్ అలర్ట్.. ప్రజలను అప్రమత్తం చేసిన సీఎం



అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రానికి భారత వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాబోయే మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు రెడ్ అలర్ట్‌జారీ చేసింది. 'పాపుమ్ పారే, పశ్చిమ కమెంగ్ జిల్లాల్లోని ఏకాంత ప్రదేశాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళ, బుధవారాల్లో తూర్పు కమెంగ్, పక్కే-కేసాంగ్ జిల్లాల్లో ఉరుములతో కూడిన అతి భారీ వర్షాలు కురుస్తాయి' అని ఐఎండీ తెలిపింది. అదేవిధంగా కురుంగ్ కుమే, లోయర్ సుబంసిరి, షి-యోమి, వెస్ట్ సియాంగ్, లోహిత్, చాంగ్లాంగ్, తిరప్, లాంగ్డింగ్ జిల్లాల్లోని ఏకాంత ప్రదేశాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఇక మే 29, 30 తేదీల్లో పక్కే-కేసాంగ్, పాపమ్ పరే, సియాంగ్, లోహిత్, ఈస్ట్ కమెంగ్, వెస్ట్ కమెంగ్, కురుంగ్ కుమే, వెస్ట్ సియాంగ్, లోయర్ దిబాంగ్ వ్యాలీ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. భారీ వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు అరుణాచల్ ప్రదేశ్‌కు రెడ్ అలర్ట్ జారీ చేసింది. భారత వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి పెము ఖాండూ హెచ్చరించారు. అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి ఎద్దడి ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో జిల్లా అధికార యంత్రాంగాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కొండచరియలు విరిగిపడే ప్రదేశాలకు వెళ్లొద్దని హెచ్చరించారు.

## ఎట్టకేలకు ఆ కారును గుర్తించి సీజ్ చేసిన నోయిడా పోలీసులు




నోయిడాలో పాలు కొనుగోలు చేసేందుకు రోడ్డు మీదకు వచ్చిన 63 ఏళ్ల వృద్ధుడిని ఢీకొట్టిన కేసులో.. ప్రమాదానికి కారణమైన ఆడీ కారును పోలీసులు గుర్తించారు. స్థానికంగా ఉన్న 150 సీసీ కెమెరాలను జల్లెడపట్టి ప్రమాదానికి కారణమైన కారును గుర్తించిన పోలీసులు.. ఢిల్లీలోని కిద్వాయ్ నగర్ పార్కింగ్ ఏరియాలో పార్క్ చేసి ఉన్న కారును సీజ్ చేశారు. నోయిడా సెక్టార్ 53కి చెందిన 63 ఏండ్ల వృద్ధుడు జనక్ దేవ్ షా అదివారం ఉదయాన్నే పాలు కొనుక్కొచ్చేందుకు బయటికి వెళ్లాడు. అదే సమయంలో ఆడి కారు అతడిని ఢీకొట్టి వెళ్లింది. ఈ ఘటనలో దాదాపు 10 అడుగులకు పైగా పైకి ఎగిరిన వృద్ధుడు బలంగా కిందపడ్డాడు. దాంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి కారుతో సహా పారిపోయాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఏడు బృందాలను ఏర్పాటు చేసి కారు కోసం గాలించారు. నిందితుడు కారును కిద్వాయ్ పార్కింగ్ ఏరియాలో పార్క్ చేసి పైనుంచి కవర్ కప్పి వెళ్లడంతో ఆ కారును గుర్తించడం ఆలస్యమైంది. ఎట్టకేలకు కారును గుర్తించిన పోలీసులు దాన్ని సీజ్ చేశారు. అయితే కారు నడిపిన వ్యక్తి కోసం ఇంకా గాలిస్తున్నారు. కారు నంబర్ ఆధారంగా వారి సెర్చింగ్ కొనసాగుతున్నది.

## పారిశ్రామిక వేత్తలను కాపాడేందుకే భగవంతుడు మోదీని పంపాడు..!



**న్యూఢిల్లీ:** "ఆ పరమాత్ముడే నన్ను ఇక్కడకు పంపాడు" అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ తిప్పికొట్టారు. గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీ వంటి పారిశ్రామిక వేత్తలకు సాయం చేసేందుకే ఆయనను పరమాత్మ పంపారని వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లోని డియోరియాలో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడుతూ, రైతులు, కార్మికులకు సేవలందించేందుకు మోదీని భగవంతుడు పంపలేదన్నారు. "అందరూ జీవసంబంధితులే. మోదీ మాత్రం అలా కాదు. ఆయనను అంబానీ, అదానీలకు సాయం చేయడం కోసం పరమాత్మ ప్రత్యేకంగా పంపించాడు. రైతులు, కార్మికులను ఆదుకునేందుకు కాదు. ఆయనను పరమాత్మే పంపించి ఉంటే పేదలు, అన్నదాతలను ఆదుకుని ఉండేవారు. అలా కాదంటే ఆయన ఏ తరహా పరమాత్ముడని అనుకోవాలి? మోదీకి చెందిన పరమాత్ముడుగానే అనుకోవాలి" అని రాహుల్ అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే 'అగ్నిపథ్' పథకాన్ని చెత్తకుప్పలో పడేస్తామని, ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ పరిమితికి చరమగీతం పాడతామని హామీ ఇచ్చారు.

## ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను విమానాశ్రయంలోనే అరెస్టు చేస్తాం : హోంమంత్రి పరమేశ్వర



ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ విమానం దిగగానే అరెస్టు చేస్తామని కర్ణాటక హోంశాఖ మంత్రి పరమేశ్వర తెలిపారు. లైంగిక దాడి కేసులో ఆయనపై ఆరోపణలు ఎదుర్కొంటున్నాయి. ఈ నెల 31న సిట్ ఎదుట విచారణకు హాజరుకావాల్సి ఉంది. అయితే, తాను తప్పకుండా విచారణకు హాజరవుతానని ఇటీవల ప్రజ్వల్ వీడియో విడుదల చేసిన విషయం విధితమే. ఓ మహిళ చేసిన ఫిర్యాదు చేయగా.. ప్రజ్వల్ రేవణ్ణ డిప్లొమెటిక్ పాస్‌పోర్ట్‌పై జర్మనీ పారిపోయినట్లుగా వార్తలు వచ్చాయి. కర్ణాటకలో సంచనలం సృష్టించిన కేసులో ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయగా.. బృందం దర్యాప్తు జరుపుతోంది. ఈ క్రమంలో హోంమంత్రి పరమేశ్వర స్పందించారు. ప్రజ్వల్ రేవణ్ణ అరెస్ట్ విషయంలో ఎలాంటి ఆలస్యం చేయబోమన్నారు. విమానం దిగగానే అరెస్ట్ చేస్తామని చెప్పారు. ప్రజ్వల్ రేవణ్ణ భారత్‌కు తిరిగి రానున్న క్రమంలో ఆయనను ఎయిర్‌పోర్టులో అరెస్టు చేసే విషయాన్ని సిట్ చూసుకుంటుందన్న ఆయన.. 31న ఏం జరుగుతుందో చూద్దాం అన్నారు. ఇదిలా ఉండగా.. ప్రజ్వల్ రేవణ్ణ ప్రస్తుతం విదేశాల్లో ఉండగా.. గడువు ఈ నెల 31తో ముగియనున్నది. ఎన్నికల్లో ఓడిపోతే ఆయన దౌత్య పాస్‌పోర్టును అక్కడి అధికారులు వెంటనే స్వాధీనం చేసుకుంటారని.. అప్పుడైనా ఆయన తిరిగిరాక తప్పదని పరమేశ్వర వివరించారు. ఇవన్నీ అర్థం చేసుకునే ప్రజ్వల్ రేవణ్ణ భారత్ తిరిగొచ్చేయాలని నిర్ణయించుకొని ఉంటారని హోంమంత్రి వ్యాఖ్యానించారు.

## ఢిల్లీ మంత్రి అతిషికి కోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ:** ఆప్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ గతంలో చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ సీనియర్ నేత, మంత్రి అతిషి కి ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టు మంగళవారంనాడు సమన్లు జారీ చేసింది. జూన్ 29న తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టు అనంతరం పార్టీ వ్యవహారాలు చూసుకుంటున్న కీలక నేతల్లో ఒకరిగా అతిషి ఉన్నారు. ఆప్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, ఒక్కొక్కరికి రూ.25 కోట్లు ఆఫర్ చేసి పార్టీలోకి ఆహ్వానిస్తోందని ఈ ఏడాది మొదట్లో అతిషి ఆరోపణలు చేశారు. అతిషితో పాటు కేజ్రీవాల్ సైతం తమ (ఆప్) ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఏడుగురు ఎమ్మెల్యేలతో బీజేపీ బేరసారాలు సాగిస్తోందని అప్పట్లో ఆరోపించారు. అయితే ఆ ఆరోపణలను బీజేపీ ఖండించింది. తమ ఆరోపణలను నిరూపించుకునేందుకు సాక్ష్యాలు చూపించాలని ఆ ఇద్దరినీ సవాలు చేసింది. తమ ఆరోపణలపై అతిషి, కేజ్రీవాల్‌కు ఢిల్లీ పోలీసులు నోటీసులు సైతం ఇచ్చారు. ఆ తర్వాత కూడా అతిషి ఇదే తరహా ఆరోపణలు చేశారు. అతిషి ఆరోపణలను పూర్తిగా నిరాధారమని, ఆమె వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొంటూ ఢిల్లీ బీజేపీ మీడియా విభాగం హెడ్ ప్రవీణ్ సంఖర్ కపూర్ అతిషిపై పరువునష్టం కేసు వేశారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు ఆమెకు తాజాగా నోటీసులు జారీ చేసింది. ఇదే కేసులో కేజ్రీవాల్‌ను ప్రతివాదిగా ప్రవీణ్ శంకర్ కపూర్ పేర్కొన్నప్పటికీ కేజ్రీవాల్‌కరు కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు.

# ప్రజాభవన్‌కు బాంబ్ బెదిరింపు

-మొదటి పేజి తరువాయి

ప్రజా భవన్‌లో బాంబ్ ఉందని అజ్ఞాత వ్యక్తి ఏకంగా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే రాష్ట్ర పోలీస్ శాఖ అప్రమత్తం అయ్యింది. ఇంటలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్ పోలీస్ అధికారులు రంగంలోకి దిగారు. బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు ప్రజాభవన్ చేరుకొని అణువణువు తనిఖీ చేపట్టారు. పంజాగుట్ట ఏసీపీ మనోహర్ కుమార్ తన సిబ్బందితో చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రజా భవన్ ఎంట్రన్స్ నుంచి నివాసం లోపల ఉన్న అన్ని గదులను, బెడ్‌రూమ్స్, కిచెన్, డైనింగ్ హాల్, విజిటర్ హాల్స్, డిప్యూటీ సీఎం చాంబర్, జిమ్, గార్డెన్, పరిసర ప్రాంతాలను డాగ్ స్క్వాడ్ బృందం పోలీసులు తనిఖీలు చేశారు.

**వాహనాల తనిఖీ**

భట్టి విక్రమార్క కాన్వాయ్, కుటుంబ సభ్యులు వాడుతున్న వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ తర్వాత ప్రజాభవన్‌లో గల అమ్మవారి ఆలయంలో తనిఖీలు చేశారు. ప్రజాభవన్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. ప్రజాభవన్‌లో బాంబు ఉందని ఫోన్ చేసిన వ్యక్తిని ట్రేస్ చేసే పనిలో పోలీసులు బిజీగా ఉన్నారు. మొబైల్ సిగ్నల్ ఆధారంగా కనిపెట్టే పనిలో ఉన్నారు. ఫోన్ చేసిన వ్యక్తి ఆకతాయా..? ఉద్దేశపూర్వకంగా ఫోన్ చేశాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రజాభవన్‌లో బాంబ్ ఉందని ఫోన్ రావడంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు.



**పేరు మార్పు**

సీఎం క్యాంపు కార్యాలయాన్ని గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా భవన్‌గా మార్చారు. క్యాంపు కార్యాలయం రూపు రేఖలు పూర్తిగా మార్చేశారు. అందుకోసం రూ.కోట్లు ఖర్చు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయి, కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. దానిని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌గా పేరు మార్చారు. ప్రజా భవన్‌లో ఉండేందుకు రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేయలేదు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ప్రజా భవన్ కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి భట్టి విక్రమార్క దంపతులు ప్రజా భవన్‌లో ఉంటున్నారు.

# బిర్యానీ తింటే.. అంతే సంగతులు

-మొదటి పేజి తరువాయి

మంచిదేనా? రోగ్యానికి ఏమైనా హాని చేస్తుందా అని ఒక్కసారైనా ఆలోచించారా? అవును.. ఈ విషయం మీరు తప్పకుండా తెలుసుకోవాలి. ఎందుకంటే మనం ఎంతో ఇష్టం తింటున్న బాస్మతీ రైస్ నకిలీదా? అసలైనదా? అని గుర్తించాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం అంటున్నారు వైద్య నిపుణులు.

బిర్యానీ.. హైదరాబాద్ మహా నగరానికి పెట్టింది పేరు. ఇక్కడ వందల కొద్దీ హొటళ్లు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున బాస్మతి బియ్యం కొనుగోలు చేస్తుంటారు. వీటిని వండి వార్చి.. నగరం అంతా పెద్ద పెద్ద రెస్టారెంట్లలో వడ్డిస్తుంటారు. సాధారణంగా బాస్మతి బియ్యానికి ఒక రకమైన గులాబీ పూల వాసన వస్తుంది. వేడిగా తింటుంటే.. ఆ వాసన మనకు ఇంకా మంచి రుచిని అందించి ఇంకాస్త ఎక్కువ తినేలా చేస్తుంది. కానీ, ఇప్పుడు అదే మన పాలిట శాపంగా మారనుంది. ప్రస్తుతం చాలా చోట్ల రసాయనాల ద్వారా పండిస్తున్న బాస్మతి బియ్యం విక్రయిస్తున్నారు. ఈ బియ్యంలో అలాంటి పూల వాసన రావడం లేదు.

దీంతో సహజంగా పండించిన బియ్యం మాదిరి మంచి వాసన కోసం బాస్మతి బియ్యంలో అత్యంత ప్రమాదకరమైన లిక్విడ్స్ కలుపుతున్నారు. ఈ లిక్విడ్ కలపడం వల్ల అది ఒరిజినల్ బాస్మతి బియ్యంలా సువాసనలు వెదజల్లుతుంది. చూడటానికి అచ్చం బాస్మతీ బియ్యం లాగే ఉండటం మాత్రమేకాకుండా.. రుచి కూడా అదే మాదిరి ఉంటుంది. దాంతో మనం ఏది సరైనదో.. కాదో.. తెలుసుకోలేకపోతున్నాం. హైదరాబాద్ నగరంలోని చాలా వరకు హొటళ్లలో ఇదే పరిస్థితి. అవగాహన లేకుండా ఇలాంటి ప్రమాదకరమైన బాస్మతీ రైస్ తింటే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లే అవుతుంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇలాంటి బిర్యానీ తిని ప్రజలు చాలా మంది హాస్పిటల్ పాలవుతున్నారు. వారిలో కొందరికి ఏకంగా ప్రాణాల మీదికొచ్చింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ప్రజల్లో కూడా అవగాహన కల్పించి కట్టడి చేయాలని అధికారులను కోరుతున్నారు.

: కుళ్లిన కూరగాయాలు, కాలం చెల్లిన ఫుడ్.. కల్తీపై తెలంగాణ సర్కార్ సీరియస్ యాక్షన్



కల్తీ వ్యవహారం తెలంగాణను కుదిపేస్తోంది. సర్కార్ సీరియస్ వార్నింగ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా మెరుపు దాడులు కంటిన్యూ అవుతున్నాయి. మొదలైన ఫుడ్ సేఫ్టీ అధికారుల సీరియస్ యాక్షన్ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోంది. ఖమ్మం, మేడ్చల్ జిల్లాలోను ప్రముఖ హొటల్స్, రెస్టారెంట్లపై ఆకస్మిక తనిఖీలు చేశారు ఫుడ్ సేఫ్టీ అధికారులు. కుళ్ళిన కబాబులు, ఎక్స్‌పైరీ మసాల దినుసులు సీజ్ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులతో హొటల్స్, రెస్టారెంట్ల యాజమానులు హడలిపోతున్నారు. .

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతన్న పేరు మోసిన రెస్టారెంట్లు, హొటళ్లపై ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారుల మెరుపు దాడులు కొనసాగుతున్నాయి. గతం వారం రోజులుగా హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రముఖ హొటల్స్, రెస్టారెంట్‌లపై రైడ్స్ చేసి వాటి భాగోతం బట్టబయలు చేస్తున్నారు. లోట్టలేసుకొని లాగించే ఫుడ్ ప్రియుల కళ్లు తెరిపిస్తున్నారు. హొటల్స్, రెస్టారెంట్స్‌లో జరుగుతున్న వాస్తవి పరిస్థితిని ప్రజల కళ్లకు కదుతున్నారు. ప్రముఖ రెస్టారెంట్లు, హొటళ్లపై మెరుపు దాడులు చేసి కాలం చెల్లిన ఫుడ్, వస్తువులు, నూనె సీజ్ చేస్తున్నారు. రీసెంట్ గా మేడ్చల్‌లోని తాజా హాలిడే రెస్టారెంట్‌లో తనిఖీలు చేశారు. స్టోర్ రూమ్‌లో ఫుడ్ కలర్స్ గుర్తించారు అధికారులు. అలాగే కుళ్లిపోయిన కూరగాయలు, నిమ్మకాయలు గుర్తించారు. లేబుల్ లేని టీపొడి, పురుగులు పట్టిన కొర్రలు సీజ్ చేశారు. అంతేకాకుండా వట్టినాగులపల్లి ప్రిజం రెస్టారెంట్, బార్‌లో తనిఖీలు చేశారు అధికారులు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు సీజ్ చేశారు. వంటగదిలో దుర్వాసన, మురుగు నీరు పేరుకుపోయినట్లు గుర్తించారు.

హైదరాబాద్‌లో స్టార్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ దాడులను తెలంగాణ వ్యాప్తంగా కొనసాగిస్తున్నారు. ఖమ్మంలోని ప్రముఖ హొటల్స్, రెస్టారెంట్‌లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేశారు. రెస్ట్ ఇన్, శ్రీశ్రీ, హవేలీ రెస్టారెంట్‌లో తనిఖీలు కొనసాగించారు. విస్తుపోయే నిజాలు కళ్లకు కట్టారు. నిల్వ ఉంచిన పాచిపోయిన చికెన్, నాసిరకం మసాలాలు సీజ్ చేశారు. రెస్ట్ ఇన్ హొటల్లో వినియోగదారులకు విక్రయించేందుకు నిల్వ ఉంచిన చికెన్ కబాబ్ లను కాల్వలో వేయించారు ఫుడ్ కంట్రోలర్ అధికారులు. ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించిన అధికారులు హొటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

పాడైపోయిన, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలతో వేడివేడిగా వంటకాలు తయార్ చేయడమే కాకుండా.. ఎక్స్‌పైరీ అయిపోయిన ఇంగ్రీడియంట్స్‌తో బిర్యానీ రెడీ చేస్తున్నట్లు అధికారులు రైడ్స్‌లో గుర్తించారు. అంతేకాదు కల్తీ నూనెలు, పాలు, మసాలా దినుసులు, తృణధాన్యాలు, పిండి, వాటర్ బాటిల్స్ సహా దేనిని వదలకుండా ప్రతీదాన్ని కల్తీ చేసి ఫుడ్ తయార్ చేస్తున్నారు. ఇక ఐస్‌క్రీమ్స్, కాఫీ, టొమాటో సాస్, వెజిటెబుల్ ఆయిల్స్, నెయ్యి.. ఇలా ఏ ఆహార పదార్థాన్ని తీసుకున్నా.. అన్నింట్లోనూ అదే దుస్థితి కొనసాగుతోంది. రెస్టారెంట్లు, హొటళ్లు%ఔ%ఆహార భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో.. ప్రజల ఆరోగ్య భద్రతా ప్రమాణాల దృష్ట్యా ప్రభుత్వం సీరియస్ ఆదేశాలు జారీచేసింది. కల్తీ విషయంలో ఎంత పెద్ద వారున్న ఉపేక్షించేది లేదంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. దాంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడుల కొరడా ఝుళిపించారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపు దాడులతో హొటల్స్, రెస్టారెంట్ల నిర్వాహకుల్లో వణుకుమొదలైంది. ఏక్షణం, ఎటు వైపు నుంచి ఏ అధికారి వచ్చి రైడ్ చేస్తాడో తెలియక టెన్షన్ పడుతున్నారు.

# ఢిల్లీ మద్యం కేసు... కేసీఆర్‌కు ముందే తెలుసు

-మొదటి పేజి తరువాయి

పూసగుచ్చినట్లుగా ఈడీ వివరించింది. లిక్కర్ స్కాం గురించి కేసీఆర్‌కు ముందే తెలుసని ఈడీ తేల్చిచెప్పేసింది. ఢిల్లీ హైకోర్టులో వాదనల సందర్భంగా ఈ విస్తుపోయే విషయాలు ఈడీ బయటపెట్టింది. ఢిల్లీ మద్యం విధానం, రిటైల్ వ్యాపారం గురించి తండ్రి కేసీఆర్‌కు వివరాలన్నీ కవిత ముందే చెప్పినట్లు ఈడీ వెల్లడించింది. అంతేకాదు.. తన టీం సభ్యులను ఢిల్లీలో కేసీఆర్‌కు.. ఆయన అధికారిక నివాసంలో కవిత పరిచయం చేశారని ఈడీ చెప్పింది. కవిత పరిచయం చేసిన వారి నుంచి మద్యం వ్యాపారం వివరాలను కూడా కేసీఆర్ అడిగి తెలుసుకున్నారని ఈడీ ఆరోపించింది. దీన్ని బట్టి చూస్తే.. ఒక్క మాటలో చెప్పాలంటే కవితకు నాన్నే మార్గదర్శి అన్న మాట.

**కవితకు బెయిలా.. అస్సలు అక్కర్లేదు!**

ఇదిలా ఉంటే.. ఈడీ, సీబీఐ కేసుల్లో కవిత ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణ ముగిసింది. ఈ సందర్భంగా కవితపై సంచలన ఆరోపణలే చేసింది ఈడీ. ఈ కేసు మొత్తంలో ఉంది ఒక్కరే మహిళ అని అందుకే బెయిల్ పొందే అర్హత ఉందని కవిత చెప్పిన విషయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఈడీ, సీబీఐ కోర్టులోనే చెప్పడం జరిగింది. 'కవిత ఏమీ సాధారణ గృహిణి కాదు.. ఒక రాష్ట్రానికి సీఎంగా పనిచేసిన వ్యక్తి కుమార్తె. విదేశాల్లో ఫైనాన్స్‌లో మాస్టర్స్ చదివి వచ్చి రాజకీయంగా ఉన్నత స్థానాలను చూశారు. అనేక కంపెనీల్లో భాగస్వామ్యురాలిగా ఉన్నారని, మరికొన్ని సంస్థల్లో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నారని కొన్నింటిలో అధీకృత సంతకం చేస్తే హొదాతో ఉన్నారు. కవిత ఎంత శక్తిమంతురాలో కవిత సాక్షులను బెదిరించిన తీరు చూస్తే అర్ధమవుతుందని ఆ వివరాలు అన్ని కోర్టు ముందు ఉన్నాయి. మహిళగా ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలన్న అంశాన్ని అసలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లోనే మహిళలకు సంబంధించిన బెయిల్ ప్రత్యేకంగా తీసుకోవాలని గతంలో ఢిల్లీ హైకోర్టు స్పష్టమైన తీర్పులు ఇచ్చిందని ప్రస్తావించింది. ఢిల్లీలో మద్యం వ్యాపారం చేయడం కోసం కవిత తన వద్దకు వచ్చినట్లు మాగుంట శ్రీనివాసరెడ్డి వాగ్మూలంలో స్పష్టం చేశారు' అని ఢిల్లీ హైకోర్టులో ఈడీ ఒక్కో సంచలన విషయాన్ని బయటపెట్టింది.

**అవును అంతా చెప్పేశారు!**

అంతేకాదు.. కవిత తన టీమ్‌ను ఎలా పరిచయం చేశారు..? ఎవరెక్కడ భేటీ అయ్యారు..? ఎన్ని కోట్లు ఎప్పుడెప్పుడు ఇచ్చారు..? ఇలా అన్ని విషయాలను సైతం ఇదివరకు ఈ విచారణలో భాగంగా చెప్పిన వారి వాంగ్మూలంను కూడా బయటపెట్టింది ఈడీ. 'ఈ వ్యవహారంపై మార్చి 2021లో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో భేటీ అవ్వగా కవితను కలవాలని, రూ. 100 కోట్ల వరకు పెట్టుబడి పెట్టడానికి కవిత సిద్ధంగా ఉన్నారు. కవితనే సంప్రదింపులు జరపాలని చెప్పినట్లు వాగ్మూలంలో మాగుంట చెప్పారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని కవిత నివాసంలో భేటీ అయినట్లు మాగుంట చెప్పారు. కేజ్రీవాల్ రూ. 100 కోట్లు సర్దుబాటు చేయాలని కోరారని అందులో రూ. 50 కోట్లు ఇవ్వాలని, ఇందుకోసం బుచ్చిబాబు వచ్చి కలుస్తాడని కవిత చెప్పిందని మాగుంట వాగ్మూలంలో చెప్పారు. బుచ్చిబాబు, మాగుంట రాఘవను మరుసటి రోజు వెళ్లి కలవగా రూ. 30 కోట్లు ఇచ్చారని..వాటిలో రూ. 25 కోట్లు నగదు రూపంలోనే ఇచ్చినట్లు చెప్పారు. మాగుంట రాఘవ కూడా తన వాగ్మూలంలో ఇదే విషయాన్ని చెప్పారు. ఒప్పందం ప్రకారం తాను రూ. 25 కోట్లు బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లికి ఇచ్చినట్లు రికార్డు చేశారు. రెండు సార్లుగా ఈ మొత్తాన్ని ఇచ్చామని, చెన్నైలో రూ.10 కోట్లు ఒకసారి, అభిషేక్ బోయినపల్లి చెప్పిన అడ్రస్‌లో మరోసారి రూ.15 కోట్లు రాఘవ మాగుంట సిబ్బంది గోపి కుమరన్ ఇచ్చినట్లు చెప్పారు. ఇదే విషయాన్ని గోపి కుమరన్ తన వాగ్మూలంలో స్పష్టత ఇచ్చారని క్లియర్ కట్‌గా చెప్పారు. ఆ తర్వాత కవిత తన టీంలో సభ్యులైన బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లి, అరుణ్ పిళ్లైలను కేసీఆర్‌కు ఢిల్లీ నివాసంలో పరిచయం చేశారు. అదే సందర్భంలో సమీర్ మహేంద్రును కేసీఆర్‌కు బుచ్చిబాబు పరిచయం చేశారు. ఆ తర్వాత కేసీఆర్ ఢిల్లీ మద్యం విధానం, వ్యాపారం, పెట్టుబడులు, రిటైల్ వ్యాపారంపై సమీర్ మహేంద్రును అడిగి వివరాలు తెలుసుకున్నారు. డబ్బులు ముట్టజెప్పిన విషయంతో పాటు, కేసీఆర్‌తో భేటీ వివరాలను గోపీ కుమారన్ వాగ్మూలంలో స్పష్టంగా రికార్డు చేశారు. ఇండో స్పిరిట్స్‌లో 33 శాతం వాటా కవిత కలిగి ఉన్నారు.. కవితకు బినామీగా అరుణ్ పిళ్లై వ్యవహరించారు. ఢిల్లీ మద్యం వ్యాపారం గురించి అరుణ్ పిళ్లైనే శరత్ చంద్రారెడ్డిని కలిసి చర్చించారు' అని పూసగుచ్చినట్లుగా కోర్టుకు ఈడీ చెప్పేసింది.

**మొత్తం ధ్వంసం చేశారు..!**

'ఢిల్లీలో కొత్త మద్యం విధానం రాబోతోంది. ఈ విషయంలో కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలు కవితకు సహకరిస్తామని అందుకు రూ. 100 కోట్లు ఇవ్వాలని అడిగారు. ఈ విషయం అరుణ్ పిళ్లై చెప్పినట్లు శరత్ రెడ్డి చెప్పారు.

## రాష్ట్రంలో హింసకు చోటు లేదు

-మొదటి పేజి తరువాయి



మేడిగడ్డ, సుందిళ్లపై న్యాయ విచారణ జరుగుతోందన్నారు. నివేదిక తర్వాత తదుపరి నిర్ణయం ఉంటుందన్నారు.

**నేను అలాంటి పనులు చేయను: సీఎం రేవంత్**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉన్నందున ఫోన్ ట్యాపింగ్‌పై సమీక్ష జరపలేదని తెలిపారు. ప్రస్తుతానికి ఈ అంశాన్ని అధికారులే చూసుకుంటున్నారని పేర్కొన్నారు. హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేశారని, బ్యాకప్ డేటాకు సంబంధించిన హార్డ్ డిస్కులు ఫామ్ హౌస్ లో ఉందో ఎక్కడ ఉందో విచారించి అధికారులు తేల్చాల్సి ఉంది.

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ వ్యవహారంలో తన ప్రమేయం లేదన్నారు. కొన్ని వస్తువులు పోయాయన్న ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని.. తన పరిపాలన పూర్తి పారదర్శకమంటూ సీఎం రేవంత్ వివరించారు. అధికారం మారాక జరిగిన బదిలీల్లో కొన్ని వస్తువులు మాయమయ్యాయని.. బాధ్యులు ఎవరో తేల్చే క్రమంలో ట్యాపింగ్ అంశం బయటకు వచ్చిందన్నారు. తమ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ జరపదని.. తీవ్రవాదులు, జాతి వ్యతిరేక శక్తుల ఫోన్లు ట్యాప్ చేయవచ్చు.. అంటూ రేవంత్‌రెడ్డి అన్నారు. అన్నింటికీ సీబీఐ విచారణ అడిగే హరీష్ రావు, కేటీఆర్.. ఫోన్ టాపింగ్ అంశాన్ని సీబీఐకి ఇవ్వాలని ఎందుకు అడగడం లేదని సీఏ రేవంత్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌తో నాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాను ఫోన్ ట్యాపింగ్ చేయించడం లేదని, అలాంటి పనులు కూడా చేయనని చెప్పారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే చాలా విషయాలు ఆయనతో చర్చించేది ఉందన్నారు.

రాష్ట్రంలో విద్యుత్ సమస్యల్లేవు, కరెంట్ కోతలు లేవని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరిగినా లోటు లేకుండా సప్లై చేస్తున్నామని రేవంత్ పేర్కొన్నారు. అనుకోని అవాంతరాలతో ఎక్కడైనా తాత్కాలికంగా సరఫరా నిలిస్తే, దాన్ని రిపేర్ చేసే వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ సగటు వినియోగం 100 నుంచి 140కి పెరిగిందన్నారు.

## గులాబీ లెక్క ఆరు

-మొదటి పేజి తరువాయి

పుంజుకుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.. తెలంగాణలో పదిహేడు పార్లమెంటు నియోజకవర్గాలున్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మూడు, బీజేపీకి నాలుగు స్థానాలు రాగా, ఒకటి ఎంఐఎం దక్కించుకుంది. మిగిలిన తొమ్మిది స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. ఈసారి కాంగ్రెస్ కు గతం కంటే ఎక్కువగానే సీట్లు దక్కే అవకాశముందని చెబుతున్నారు. అధికారంలో ఉండటంతో పాటు మరో అవకాశం ఇద్దామన్న జనం నాడి కూడా ఆ పార్టీకి అనుకూలించే అంశంగా భావిస్తున్నారు. అదే సమయంలో బీజేపీ కూడా గతం కంటే తెలంగాణలో బలోపేతమయిందని అంటున్నారు. గతంలో వచ్చిన నాలుగు స్థానాలకు మించి ఈసారి సీట్లు దక్కించుకునే ఛాన్స్ అయితే లేకపోలేదంటున్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీ విషయానికి వస్తే గతంలో గెలిచిన తొమ్మిది స్థానాలు రాకపోవచ్చు కానీ కనీసం ఆరింటిలో ఆ పార్టీ గెలిచే అవకాశముందని చెబుతున్నారు. ప్రస్తుతం ఆ పార్టీ ఉన్న పరిస్థితుల్లో ఆరు స్థానాలు గెలవడమంటే ఆషామాషీ విషయం కాదు. ఇందుకు అనేక కారణాలున్నాయి. కేసీఆర్ పై సానుభూతి తో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను సక్రమంగా అమలు చేయకపోవడం, విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు, కరువు, పంటలను కొనుగోలు చేయకపోవడం వంటి కారణాలు బీఆర్ఎస్ కు లాభించే అంశాలుగా చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బస్సు యాత్రతో బయలుదేరిన కేసీఆర్ కు జనం పోటెత్తడాన్ని కూడా ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కరువు రావడంతో రైతాంగం ఇబ్బందులు పాలయింది. అలాగే అకాల వర్షాలు కూడా అన్నదాతలను నట్టేట ముంచాయి. ధాన్యం కొనుగోలు కూడా సక్రమంగా జరగకపోవడంతో కర్షకులు కారు పార్టీ వైపు చూశారన్న అంచనాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. కేసీఆర్ గత పదేళ్ల పాలనపై అసంతృప్తితో కాంగ్రెస్ ను అధికారంలోకి తెచ్చుకుంటే ఇప్పుడు అసలుకే మోసం వచ్చిందంటూ రైతాంగం కూడా కొంత గులాబీ పార్టీ వైపు టర్న్ అయినట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మహిళలు, రైతులు, యువత కూడా కొంత భాగం కేసీఆర్ పార్టీ వైపు చూడటంతో ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో కారు స్పీడ్ మామూలుగా ఉండదన్న టాక్ కూడా వినిపిస్తుంది. ఆరు కంటే ఎక్కువ స్థానాలు వచ్చినా ఆశ్చర్యం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే ఏ విషయం తెలియాలంటే జూన్ 4వ తేదీ వరకూ ఆగాల్సిందే.

## కాకతీయ కళాతోరణంపై ఎందుకంత కోపం!

**హైదరాబాద్ :** తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే పలుమార్లు బహిరంగంగా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కేసీఆర్ తీసుకొచ్చిన టీఎస్ స్థానంలో రేవంత్ టీజీ తీసుకొచ్చారు. తాజాగా అధికారిక చిహ్నంలో మార్పులు చేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. కేసీఆర్ హయాంలో రూపొందించిన రాష్ట్ర అధికారిక చిహ్నంలోని కాకతీయ కళాతోరణాన్ని తీసేస్తున్నట్లు రేవంత్ ఢిల్లీ వేదికగా ప్రకటించారు. రేవంత్ నిర్ణయంపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మీకు కాకతీయ కళాతోరణంపై ఎందుకంత కోపం.. చార్మినార్ చిహ్నం అంటే మీకెందుకంత చిరాకు అని రేవంత్‌ను సూటిగా ప్రశ్నించారు. ఇదెక్కడి మూర?పు ఆలోచన అని మండిపడ్డారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ అనేవి రాచరికపు గుర్తులు కాదు.. వెయ్యేళ్ల సాంస్కృతి వైభవానికి చిహ్నాలు అని పేర్కొన్నారు. అవి వెలకట్టలేని తెలంగాణ అస్తిత్వానికి నిలువెత్తు ప్రతీకలు అని కేటీఆర్ గుర్తు చేశారు. జయజయహే తెలంగాణ గీతంలో ఏముందో తెలుసా ? "కాకతీయ" కళాప్రభల కాంతిరేఖ రామప్ప. గోల్కొండ నవాబుల గొప్ప వెలుగే.. "చార్మినార్". వీటిన్నంటిని అధికారిక గీతంలో కీర్తించి.. అధికారిక చిహ్నంలో మాత్రం అవమానిస్తారా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇవాళ తెలంగాణ గుర్తులు మారుస్తామంటున్నారు.. రేపు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ సరిహద్దులూ చెరిపేస్తారా..? గత పదేళ్లుగా.. ప్రభుత్వ అధికారిక చిహ్నంపై.. యావత్ తెలంగాణ సమాజం ఆమోద ముద్ర ఉంది. సబ్బండ వర్ణాల మనసు గెలుచుకున్న సంతకమూ ఉంది. రాజకీయ ఆనవాళ్లను తొలగించాలన్న కక్షతో.. రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని చెరిపేస్తే సహించం అని కేటీఆర్ అన్నారు. పౌరుషానికి ప్రతీకైన ఓరుగల్లు సాక్షిగా%ఔ% మీ సంకుచిత నిర్ణయాలపై సమరశంఖం పూరిస్తాం..! తెలంగాణ సమాజాన్ని ఏకం చేసి ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తాం..! అని కేటీఆర్ స్పష్టం చేశారు.



# బోరజ్ చెక్ పోస్ట్ పై ఏసీబీ దాడులు

– ఆర్టీవో సిబ్బంది అవినీతి కార్యకలాపాలపై విచారణ.?

– పలు రికార్డులు స్వాధీనం

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** రాష్ట్రంలోనే అతిపెద్ద చెక్ పోస్ట్, జిల్లాలోని బోరజ్ గ్రామం వద్ద గల తెలంగాణ -మహారాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ పై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి రికార్డులను స్వాధీనపరుచుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు జిల్లాలోని జైనథ్ మండలం బోరజ్ జాతీయ రహదారి నెంబర్ 44 పై గల చెక్ పోస్ట్'లో ఏసీబీ సోదాలు నిర్వహించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ యశ్వంత్, ఏఎం విఐ అపర్ణ, విధులు నిర్వహిస్తుండగా అక్కడే కొందరు ప్రైవేటు వ్యక్తులను నియమించుకోవడంపై ఏసీబీ అధికారులు ఆరా తీశారు. నిత్యం వేలాది వాహనాలు బోరజ్ చెక్ పోస్ట్ మీదుగా రాకపోకలు సాగిస్తుండగా భారీ వాహనాలకు సంబంధించి లైసెన్సు పర్మిట్, సరుకు రవాణా వేబిల్స్, వాహన బిల్లులు డాక్యుమెంట్ లపై ఎంత మేరకు డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయంపై ఆరా తీశారు. ప్రైవేటు వ్యక్తులను నియమించడంపై కేసులు కూడా నమోదు చేసినట్టు తెలిసింది. రెండు గంటలపాటు సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి.



# ఆగని అక్రమ రేషన్ బియ్యం రవాణా

**వరంగల్ :** ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే దందా ఆగడం లేదు. పోలీసులు ఎన్ని కేసులు పెట్టిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అక్రమార్కులు దొడ్డి దారిన రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారు. రోజుకో చోట బియ్యం పట్టుబడుతూనే ఉన్నాయి.తాజాగా రామగుండం టాస్క్ పోర్స్ పోలీసులు బారీ మొత్తంలో 260 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సుమారు 8 లక్షల రూపాయల విలువచేసే రేషన్ బియ్యంతో పాటు ఐచర్ డిసిఎం వ్యాన్ ను సీజ్ చేశారు. ఇద్దరిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.జగిత్యాల నుంచి మహారాష్ట్ర కు బియ్యాన్ని వ్యాన్ లో తరలిస్తున్న డ్రైవర్ మహు ముద్ అలీ అరెస్టు చేశారు. బియ్యం తరలించే అసిఫాబాద్ జిల్లా వాంకిడికి చెందిన షంశీర్ పై కేసు నమోదు చేశారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్ గేట్ వద్ద టాస్క్ పోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా ఐచర్ వ్యాన్ లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడ్డాయని రామగుండం సిపి ఎం.శ్రీనివాస్ తెలిపారు. అనుమానస్ప దంగా వెళ్ళున్న వ్యాన్ ను తనికీ చేయగా 150 క్వింటాళ్ళ రేషన్ బియ్యం పట్టుబడ్డాయని చెప్పారు. వ్యాన్ డ్రైవర్ మహుముద్ అలీ ని అదుపులోకి తీసుకుని విచారించగా ఆసిఫాబాద్ జిల్లా వాంకిడికి చెందిన షనీశీర్ జగిత్యాల జిల్లాలో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి మహారాష్ట్ర కు తరలిస్తున్నా డని తెలిపారు. ప్రస్తుతం డ్రైవర్ ను అరెస్టు చేయగా బియ్యం అక్రమంగా తరలించే షంశీర్ పరారీలో ఉన్నాడు.అదే విధంగా పెద్దపల్లి జిల్లా ధర్మారం చుట్టుపక్కల గ్రామాల నుంచి దుదని తుఫాన్ సింగ్, చింతల సంపత్ సేకరించి అక్రమంగా తరలించేందుకు నిల్వ చేసిన 110 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు గుర్తించారు. దుదాని తుఫాన్ సింగ్ అరెస్టు కాగా చింతల సంపత్ పరారీలో ఉన్నాడని సిపి తెలిపారు.రేషన్ బియ్యంతోపాటు ఎలాంటి అక్రమ దందాలకు పాల్పడే వారిపై పిడి యాక్టుతోపాటు కఠిన చర్యలు చేపడుతామని రామగుండం సిపి శ్రీనివాస్ హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపైనా, అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారి పైన నిఘా పెట్టామని తెలిపారు.అక్రమ దందాలు చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, నకిలీ పత్తి విత్తనాలు, జీరో వ్యాపారాలు, అక్రమ భూదందాలు భూకబ్జాలు, నకిలీ వ్యాపారాలు, జాబ్ ఫ్రాడింగ్ , ఇసుక, బొగ్గు అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగ్ ,గేమింగ్ ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.వరుస దాడులు నిర్వహించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల సహకారంతో అధునాతన సాంకేతిక పద్ధతుల ద్వారా అక్రమార్కుల కదలికలను గుర్తించడం జరుగుతుందన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థకు కేటాయించిన బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



# గులాబీ నేతల వ్యూహాత్మక మౌనమేనా




**కరీంనగర్ :** పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ తరువాత.. బీఆర్ఎస్‌లో సైలెంట్ కనబడుతుంది. ఎక్కడా హడావిడి కనబడటం లేదు. నేతలు కూడా.. ఎన్నికల పోలింగ్ గురించి పెద్దగా చర్చించడం లేదు. అయితే, రెండు నియోజకవర్గాలు మినహా మిగతా ఐదు నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఇవ్వలేమన్న భావన కనబడుతుంది. దీంతో ఇక్కడ ఫలితం ఏ విధంగా వస్తుందో ఉత్కంఠ నేతల్లో కనబడుతుంది. కరీంనగర్ పరిధిలో బీఆర్ఎస్ అవిర్భావం నుంచి 2018 ఎన్నికల వరకు హడావిడి కనిబడింది. కానీ 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్?కి ఊహించని షాక్ తగిలింది. అప్పటి నుంచి వరుసగా అనుకున్న స్థాయిలో ఫలితాలు రావడం లేదు అసెంబ్లీ ఎన్నికల్లో కూడా గట్టి షాక్ తగిలింది. అయితే, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటిందుకు ప్రయత్నం చేసింది. ఇక్కడ బీఆర్ఎస్ నుంచి వినోద్ కుమార్ బరిలోకి దిగారు. రెండు నెలల పాటు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఖచ్చితంగా గెలువలనే పట్టుదలతో ముందుకు సాగారు. బిజేపీ నుంచి బండి సంజయ్, కాంగ్రెస్ నుంచి రాజేందర్రావు పోటీ చేశారు. అయితే పోలింగ్ తమకు అనుకూలంగా లేదని నేతల్లో చర్చ సాగినట్లు తెలుస్తోంది. దీంతో ముఖ్య నేతలు ఈ విషయం గురించి పెద్దగా చర్చించడంలేదు. వినోద్ కుమార్ కూడా పూర్తిగా పోలింగ్‌పై సమీక్ష నిర్వహించేందుకు విముఖత చూపినట్లు తెలుస్తోంది. ఈ నియోజకవర్గంలో ముగ్గురు ఎమ్మెల్యేలు.. బలమైన నేతలు ఉన్నప్పటికీ గట్టిగా పోటీ ఇవ్వలేకపోయామనే భావన వ్యక్తమైంది.కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 7 అసెంబ్లీ స్థానాలు ఉంటే.. సిరిసిల్ల, హుజురాబాద్ నియోజకవర్గాల్లోనే, బీఆర్ఎస్‌కి అనుకూలంగా ఓట్లు పడ్డాయి. మిగతా ఐదు నియోజకవర్గాల్లో ఆశించిన స్థాయిలో ఓట్లు రాలేదని తెలుస్తోంది. ముఖ్యంగా అర్బన్ ప్రాంతంలో బీఆర్ఎస్ ఏ మాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. కరీంనగర్ అసెంబ్లీలో కూడా అనుకున్న స్థాయిలో ఓట్లు బీఆర్ఎస్?కి రాలేదనే చర్చ సాగింది. పోలింగ్?కు ముందు చొప్పదండి, సిరిసిల్ల, హుస్నాబాద్, మానకొండూరు, హంజారాబాద్లో మెజారిటి ఓట్లు వస్తాయని నేతలు భావించారు. అందుకు విరుద్ధంగా పోలింగ్ సరళి కనబడింది. హుస్నాబాద్లో, కాంగ్రెస్, బిజెపీ మధ్యనే గట్టి పోటీ నెలకొంది. అదే విధంగా, మానకొండూరు, చొప్పదండిలో బిజేపీ, కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోరు కనబడింది. దీంతో అనుకున్న స్థాయిలో బీఆర్ఎస్?కు ఓట్లు రాలేదని నేతల్లో అభిప్రాయం ఏర్పాడినట్లు చర్చ జరుగుతోంది. దీంతో ఎన్నికల తర్వాత నుంచి ముఖ్య నేతలంతా సైలెంట్ అయ్యారు. అయితే సైలెంట్ ఓట్లు తమను గట్టెక్కిస్తాయనే ధీమాతో ఉన్నారు. వినోద్ కుమార్ కూడా మీడియా చిట్ చాట్?లో మోదీ వేవ్ కనబడిందని ప్రస్తావించారు. అయితే పోరాటం చేసే బీఆర్ఎస్?కి ప్రజల మద్దతు ఉందని చెబుతున్నారు. ఇక్కడ త్రిముఖ పోరు ఉండటంతో తమకే లాభం జరుగుతుందని బీఆర్ఎస్ నేతలు ధీమాతో ఉన్నారు. అయితే క్షేత్ర స్థాయిలో నివేదికలు ప్రతికూలంగా ఉన్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో 7 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ వైపు బలంగా ఉన్న సమయంలోనే వినోద్ కుమార్ ఓడిపోయారు.

# నకిలీ ఎరువుల లారీ పట్టివేత

– పట్టుబడిన నకిలీ ఎరువుల విలువ రూ.5.50 లక్షలు




**వాస్తవ నేస్తం,భీంపూర్:** రైతుల అమాయకత్వాన్ని అవసరాన్ని ఆసరాగా చేసుకుని దళారులు, నకిలీ పత్తి విత్తనాలు విక్రయించే ముఠాలు రైతులను మోసం చేస్తున్నాయి. గత వారం రోజుల నుండి జిల్లాలో వర్షాలు పలుచోట్ల పడడంతో రైతులు పంట పొలాలను విత్తనాలు విత్తడానికి సిద్ధంగా చేసుకుని విత్తనాల కోసం ఫర్టిలైజర్ షాప్'ల ముందు బారులు తీరుతున్నారు.ఇదే ఆసరాగా చేసుకుని ఒకపక్క దళారులు మరోపక్క నకిలీ పత్తి విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయించే ముఠాలు సిద్ధంగా ఉన్నాయి. పోలీసులు పలుచోట్ల దాడులు నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముఠాలను అరెస్టు చేసిన కూడా కొందరు ఏ మాత్రం భయపడకుండా రైతులకు నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్ర ని ఆనుకొని ఉండడంతో మహారాష్ట్ర నుండి నకిలీ పత్తి విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయించే వారు ఈజీగా నకిలీ పత్తి విత్తనాలు, నకిలీ ఎరువులు జిల్లాలోకి దిగుమతి చేసుకుంటున్నారని ఆరోపణలు లేకపోలేదు. నకిలీ ఎరువులతో వెళ్తున్న లారీని ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్ మండలంలో పోలీసులు పట్టుకున్నారు. భీంపూర్ మండల వ్యవసాయ అధికారి రవీందర్ ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై ప్రదీప్ కుమార్, సిబ్బందితో కలిసి నకిలీ ఎరువులతో వెళ్తున్న లారీని పట్టుకున్నారు. అందులో 750 నకిలీ ఎరువుల బస్తాలు ఉన్నాయని, వాటి విలువ రూ.5,55,000/- విలువ ఉంటుందని ఎస్సై ప్రదీప్ కుమార్ తెలిపారు. లారీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఇండియా కూటమి వస్తే పండుగే... పండుగ

**హైదరాబాద్ :** కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోందని ఆ పార్టీ నేతలు కొన్ని రోజులుగా ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఇప్పటి వరకు జరిగిన ఐదు విడతల పోలింగ్ సరళిని లెక్కలు వేసుకుంటూ కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు వస్తాయో ఓ అంచనాకు వస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల ప్రకారం.. కాంగ్రెస్ ఒంటరిగా 150 సీట్లు గెలుస్తుందని రాహుల్‌గాంధీ ప్రకటించారు. మరో 150 సీట్లు మిత్ర పక్షాలకు వస్తాయని అంటున్నారు. దీంతో కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ అంచనాలు రోజు రోజుకూ పెరుగుతుండడంతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిలో జోష్ కూడా క్రమంగా పెరుగుతోంది. కేంద్రంలో కాంగ్రెస్ అధికారం చేపడితే తనకు తిరుగు ఉండదన్న భావనలో ఉన్నారు రేవంత్. ఈ విషయాన్ని ఇప్పటికే ఆయన తన సన్నిహితుల వద్ద పదేపదే చెబుతున్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నది కేవలం మూడు రాష్ట్రాల్లోనే. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలో ఆ పార్టీ ప్రభుత్వాలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల ఖర్చులకు ఈ రాష్ట్రాల నుంచే భారీగా నిధులు కాంగ్రెస్‌కు అందుతున్నాయి. రేవంత్‌రెడ్డి అయితే అధిష్టానం వద్ద మంచి మార్కులు కొట్టేసేందుకు మిగతా రాష్ట్రాలకన్నా ఎక్కువ నిధులు సమకూరుస్తున్నారని ప్రచారం జరుగుతోంది.తెలంగాణలో ఐదేళ్లు సీఎంగా రేవంత్ ఉంటారన్న భరోసా అయితే అధిష్టానం ఇచ్చింది. అయితే రేవంత్ మాత్రం పదేళ్లు తానే ముఖ్యమంత్రి అని ఇటీవల ప్రకటించారు. తన ప్రభుత్వాన్ని ఎవరూ టచ్ చేయలేరని హెచ్చరించారు. దీని వెనుక పెద్ద కారణమే ఉందని తెలుస్తోంది. కాంగ్రెస్‌కు రాష్ట్రం నుంచి భారీగా నిధులు సమకూర్చుకుంటూ పార్టీలో పట్టు పెంచుకుంటున్న రేవంత్.. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలిస్తే మరింత పట్టు సాధించాలని భావిస్తున్నారు. తద్వారా ఇప్పటికీ సీఎం పదవి ఆవిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టివిక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి వారికి చెక్ పెట్టాలన్న ఆలోచనలో ఉన్నారు. పదేళ్ళు తన సీటు ఖాయం చేసుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

మరోవైపు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో అప్పులన్నీ తీరుతాయని, సంక్షేమ పథకాలకు భారీగా నిధులు వస్తాయని భావిస్తున్నారు. అందుకే కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావాలని ఆశిస్తున్నారు. దీనికోసం తెలంగాణ నుంచి అధిక స్థానాలు ఇవ్వడానికి సర్వశక్తులు ఒడ్డారు. కానీ, ఆశించిన ఫలితాలు రావని ఇప్పటికే టీపీసీసీ ఓ అంచనాకు వచ్చింది. అయినా కేంద్రంలో కాంగ్రెస్ వస్తుందని రాహుల్ ప్రకటించడం సీఎం రేవంత్‌కు ఉత్సాహాన్ని ఇచ్చింది.

## నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై దాడులు

**కరీంనగర్ :** ఎలాంటి అనుమతులు లేకుండా మోసాలకు పాల్పడుతున్న నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో తంగళ్ళపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ మహబూబ్, రుద్రంగి మండలం కేంద్రానికి చెందిన బొండు అంజయ్య, గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన ఓరుగంటి రాములు నకిలీ ఏజంట్లుగా గుర్తించారు. ముగ్గరిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో నకిలీ వీసాలు ఇచ్చి మోసానికి పాల్పడుతున్నారని తెలిపారు.ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్ళే వారికి నకిలీ విసాలు అంటగట్టి అందినకాడికి దోచుకుని మోసానికి పాల్పడే వారు చాలా మంది ఉన్నారని ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 19 మందిని గుర్తించి కేసులు నమోదు చేశామని ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు.నకిలీ గల్ఫ్ ఎజెంట్స్ విజిట్ వీసాల పై జిల్లాలో ఉన్న నిరుద్యోగులని టార్గెట్ చేసి వారి నుండి అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని మాయ మాటలు చెప్పి గల్ఫ్ దేశాలకి పంపిస్తారని చెప్పారు. అక్కడికి వెళ్ళిన తరువాత కంపెనీ వీసా కాదని తెలిసి దేశం కానీ దేశంలో ఎం చేయాలో తెలియక అష్ట కష్టాలు పడి స్వదేశానికి తిరుగు ప్రయాణం అవడం లేదా అక్కడే ఏదో చిన్న చితక కూలి పని చేసుకోవడం వంటివి జరుగుతునాయని తెలిపారు.ఎవరైతే ఏజెన్సీల లేదా ఏజెంట్ల చేతిలో మోసపోయారో వారు నేరుగా పోలిసులకు పిర్యాదు చేస్తే ఆ పిర్యాదు పై తగిన రీతిలో విచారణ జరిపి నేరం రుజువు అయితే సదరు ఏజెంట్ పై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో గత సంవత్సరం 43 కేసులు నమోదు కాగ, ఈ సంవత్సరం ఇప్పటి వరకు 19 కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ వీసాలు ఇచ్చి మోసం చేసే వారి ఏజెన్సీ రద్దు కు సిఫారసు చేయడం తో పాటు వారిపై ఖఆ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్ళాలనుకునే వారు లైసెన్స్ కలిగి ఉన్న ఏజెంట్లను మాత్రమే ఆశ్రయించాలని కోరారు.నకిలీ ఏజంట్ల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ గల ఏజెంట్ల వివరాలు తెలుసుకోడానికి పోలీస్ శాఖ వారిని సంప్రదించవచ్చని సూచించారు. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయిన వారు.. విదేశాలకు పంపిస్తానని డబ్బులు తీసుకొని , పాస్ ఫోర్ట్ తీసుకుని పంపకుండా మోసం చేసిన , నకిలీ గల్ఫ్ ఏజెంట్ల కి సంబంధించిన సమాచారం

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com